# చివరకు మిగిలేది...

అప్పుడే రెండేళ్లు గడిచిపోయిందంటే నమ్మకం కల్గడంలేదు నాకు. నేను ముందు పని చేసిన బడికి వెళ్తూండటం ఏదో థ్రిల్లింగ్‌గా ఉంది. నిజానికి వెళ్లాలని లేదు. అందుకే ట్రాన్స్‌ఫర్ అయిననాడు వీడ్కోలు సమావేశానికే అంగీకరించలేదు. కాని, నా క్లోజ్ ఫ్రెండ్ ముబారక్ అలీ రిటైర్మెంట్ ఫంక్షన్‌కి వెళ్లకుండా ఉండలేకపోతున్నాను. పైగా ఈ రెండేళ్లూ కొత్తబడిలోని అనుభవాలు నన్ను పాతబడి గురించి సానుకూలధోరణిలో ఆలోచించేలా చేశాయి. బస్సులో కూర్చోగానే ఆ బడి జ్ఞాపకాలన్నీ గుర్తుకు రాసాగాయి. ముందుగా గుర్తొచ్చేది హెడ్‌మిస్ట్రెస్ కమల.

అసలే మహిళ. అందులో కొత్త- మా కాలక్షేపానికి కొరతేలేదు.

"ఇప్పుడు టైమెంతవుతూంది మోహన్‌గారూ?" ఆలస్యంగా వెళ్లిన ఒక రోజు నన్ను నిలదీసింది.

"మీకు తెలీదా మేడం?" నా సమాధానం తీరు అది.

అసలే తెల్లగా ఉంటుంది. ఎర్రగా మారిపోయింది - ఆమె మొహం. "ఇంత ఆలస్యంగా వస్తే నేనొప్పుకొను!" ఆమె గొంతులో కరకుదనం.

"మీ రొప్పుకోవడం లేదని బస్సు తొందరగా వస్తుందా మేడం?" నా వెటకారం.

"అయితే బస్సు లేటైనప్పుడల్లా మీరు గంట లేటుగా వస్తారా?" ఆమె కంఠంలో తీవ్రత.

"నేచురల్లీ!" భుజాలెగరేశాన్నేను.

"దెన్, మీరు లేటైనప్పుడల్లా నేను హాఫ్ డే సీ.ఎల్. వేస్తాను" అంటూనే అటెండెన్స్ రిజిస్టర్ తీసుకొని తన గ్రీన్ పెన్‌తో సీ.ఎల్ మార్క్ చేసింది.

ఊహించని ఈ పరిణామానికి నా రక్తం కుతకుతలాడిపోయింది. 'దీనికి తగిన బుద్ధి చెప్పాలి' అనుకుంటూ - "నువ్వు అనవసరంగా రెచ్చిపోతున్నావ్. దీని రిజల్ట్ చాలా భయంకరంగా ఉంటుంది చూడు!" విచక్షణ మరచి తర్జని చూయించాను. అక్కడి నుండి బయటపడ్డాను.

అది నేనిచ్చిన శాంపిల్ షాక్. అక్కడి నుండే మొదలైంది అసలు కథ.

మూడు రోజుల్లోనే స్టాఫ్‌ని రెండుగా చీల్చాను. ఎక్కడైనా సిబ్బంది హెడ్ ఆఫ్ ది ఇనిస్టిట్యూషన్‌కు వ్యతిరేకంగానే ఉంటుంది - అది పాలకులు - పాలితులు అనే సహజ వైషమ్యం. ఒకరిద్దరు భజనపరులు తప్ప అంతా నా వర్గంలోనే చేరారు.

శిశుపాలుని దోషాలు కృష్ణుడు లెక్క పెట్టినట్లు అమ్మగారి తప్పుల్ని ఎప్పటికప్పుడు మార్కింగ్ చేయడం, చిన్న చిన్న విషయాలకు యాగీ చేయ్యడం ఉధృతం చేశాను.

ఆమె అనుకూల వర్గంలోని హిందీ పండితుడొకసారి ఆలస్యంగా బడికొచ్చి సంతకం చేశాడు. నేను నలుగుర్నీ వెంటేసుకుని ఆఫీసుపైకి దండెత్తాను.

ఓ అరగంట తర్వాత సదరు హిందీ పండితుడు - "మేడం! నాకు సెలవు వెయ్యండి!" అనేదాకా తీసుకొచ్చాం.



బండిమీద వస్తుంటే ఏదో యాక్సిడెంట్ జరిగిందంటూ కారణాలు చూపించబోయాడు. నేనూరుకుంటానా?

స్కూల్లో కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించే బాధ్యత నాదే. అక్కడి విద్యార్థులకు మనమాటే వేదవాక్కు. లేకపోతే వీపు చీరేస్తాం కదా! పి.ఇ.టి. ఉన్నా, సీనియర్ టీచర్స్ ఉన్నా మనకున్న తెలివితేటలు, టాలెంట్ ఉపయోగించి మనమో ప్రత్యేకస్థానాన్ని సాధించుకోగలిగాం మరి. ఇదీ హెడ్డుకి, ఆమె భజనపరులకీ కంటగింపు.

"ఈ రోజు పిల్లలకి ఫలానా ప్రోగ్రాం నిర్వహించాలి." నేను మాట్లాడక పోయినా, నన్ను పిలిచి రిక్వెస్టు చేస్తుంది హెచ్చెమ్.

నేను ఔననకుండా, కాదనకుండా ఆమె సమక్షం నుండి బయటపడి కచ్చితంగా

ఆరోజు కార్యక్రమం జరపకపోవడమో, తప్పనిసరై జరిపితే, ఆమె కోరికకు పొంతనలేని ప్రోగ్రాం నిర్వహించడమో జరిగితీరుతుంది. అంతే!

స్కూల్లో పీ.జీలు, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నా ఉన్నత తరగతులకు ఇంగ్లీషు నేను చెప్పాల్సిందే. మనం తెలుగులో మాట్లాడగలిగినంత బాగా ఇంగ్లీషులోనూ దంచెయ్యగలం. ఓ రోజు ఈ విషయంలోనూ తగవొచ్చింది.

"ఏంటయ్యా ? హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ దగ్గరికికొస్తున్నాయి. పదో తరగతివాళ్ళకి ఇంకా రెండు పాఠాలు కూడా పూర్తి కాలేదట....?"

"ఎవరు చెప్పారు?" చురుక్కున అడ్డుకున్నాన్నేను.

వెంటనే జవాబు చెప్పలేదామె. నేనిట్లా అడుగుతాననుకొని ఉండదు. "ఎవరో చెప్పడమెందుకు? మీరు చెప్పండి! పూర్తయ్యాయా?" నా ప్రశ్ననే నాకే తిరగ్గొట్టింది.

ఆ సంగతి నాకు తెలుసు. కాని, నేనొప్పుకోవాలి గదా? "నేను మాత్రం సిలబస్ ననుసరించే చెబుతున్నాను" అనేశాను.

ఆమె నన్నో పురుగును చూసినట్టు చూసింది.

అది తరగతిగదిలో నరసింహావతారం ఎత్తేందుకు ఊతమిచ్చింది. ఆ సమచారమిచ్చారన్న వెధవల్ని బెత్తాలిరిగేలా బాది, "ఇకపై నా గురించి ఎవ్వడైనా పిచ్చిపిచ్చిగా చెబితే, పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉంటుంది!" కోపంలో సహజంగా దోర్లే బూతుల్తో వార్నింగిచ్చేశాను.

స్కూల్లో నాకున్న పేరుప్రతిష్ఠల్ని ప్రదర్శించుకునే ఏ అవకాశాన్నీ వదల్లేదు నేను. కాకపోతే క్రమేపీ విధినిర్వహణ పట్ల శ్రద్ధాసక్తులు మందగించాయన్న నిజం ఒప్పుకోవాల్సిందే. అయినా మనమే టాప్. లేకపోతే ప్రభుత్వ పాఠశాలల్లో సక్రమంగా పని చేసేవాళ్లెవరుంటారు? ఆ మధ్య ఒక పేరెంట్ కలిసి అన్న మాటలే దానికి తార్కాణం - "ఏం సార్! మీరెల్లిపోయిన్రు. ఇస్కూల్ కుప్ప అయిపోయింది."

"అరె, నా ప్లేస్‌లో వచ్చిన కుర్రాడు చాలా జబర్దస్త్‌గా పనిచేస్తాడని విన్నానే?" ఉత్తదే. మాట వరసకలా అని చూశాను. అసలు ఆ కార్తీక్ గురించి నాకేమీ తెలీదు.

"ఛ! వేస్టుసార్! పిల్లలకసలు భయమేలేదు. ఒగసారి ఇస్కూలుకు వొయిన. 'కొత్తసార్, కొత్తసార్' అంటుంటే జూసిన. పిల్లల్ల గలసి పొయ్యిండు. సారంటే గట్లుంటడా? పిల్లలకు భయం,

- భక్తి ఉండాలె. ఇప్పటికీ మీ పేరు జెబితే పిల్లలు ఉచ్చపోసుకుంటరు.''

నాకు నవ్వొచ్చింది. ఎక్కడికెళ్ళినా మనకు లభించే గౌరవాదరాలు అలాంటివే మరి.

ఇప్పుడనిపిస్తుంది, పాపం! ఆ హెచ్చెమ్ మంచిదే. నేనే కొంచెం ఓవర్ చేశానేమోనని. ఆ ఒక్కరోజు హాఫ్‌డే సీ.ఎల్ వేయడం తప్ప నాకు ఆమె చేసిన అపకారమేమీ లేదు. నేనే మనసులో కక్ష పెంచుకున్నాను గానీ, ఆమె ఏ రకమైన కక్ష సాధింపు చర్యలూ చేపట్టలేదు.

నా ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెడుతూ బస్సు శ్రీనగర్ స్టాపులో ఆగింది. బస్సు దిగి బడి వైపు అడుగులేస్తుంటే - అప్పట్లో నేను చేసిందంతా తప్పేనన్న నిజం నన్ను నిలదీయడం మొదలు పెట్టింది. అంతంలేని ఆలోచనల మధ్య నలుగుతూ, స్కూల్ కాంపౌండ్‌లో అడుగుపెట్టాను.

వాతావరణం గోలగోలగా ఉంది. పిల్లలంతా తూనీగల్లా ఉరుకులూ, పరుగులూ పెడ్తూ అరుస్తున్నారు. నేనున్నప్పుడు ఇంత అల్లరి ఉండేది కాదు.

నన్ను చూసి గుర్తుపట్టిన పిల్లలు కొందరు విష్ చేశారు. మరికొందరు పారిపోయారు. పారిపోతున్న వినయ్‌గాణ్ని పట్టుకొని సాయికిరణ్- "ఇప్పుడు ఈసార్‌ది మనస్కూల్ గాదు రారా! ఏం కొట్టడు దా!'' అంటూ బలవంతంగా లాక్కొస్తున్నాడు.

పనిలో హడావుడిగా తిరుగుతున్న ఒకరిద్దరు లేడీ టీచర్స్ నన్ను చూసి పలకరింపుగా నవ్వారు. నేను నేరుగా హెడ్‌మిస్ట్రెస్ గది కెళ్లాను.

"హలో మోహన్‌గారూ, బాగున్నారా?'' ముందుగా ఆమే విష్ చేసింది. ఆ పలకరింపులో ఏ కల్మషమూ లేదు.

"నమస్తే మేడం!'' ఇదే మొదటిసారేమో నమస్కరించడం. "బావున్నారా? పిల్లలు బాగా చదూతున్నారా?'' శ్లేష లేకుండానే అడిగాను.

"ఏం చదువుతున్నారయ్యా! ఎంతైనా మీరు లేని లోటు కనిపిస్తూనే ఉంటుంది'' భేషజాలు లేకుండా చెప్పింది ఆమె.

నాకు తెలియకుండానే భుజాలు ఉప్పొంగాయి ఒక్క చిరునవ్వుతో ఆ భావం ప్రకటించేశాను. ఆమె హడావుడిలో ఉంది. డిస్టర్బ్ చెయడమెందుకని అక్కడి నుండి బయటపడ్డాను.

ముబారక్ అలీ గురించి అడిగితే - అతను భోజనం ఏర్పాట్లు చేయించడంలో మునిగి

ఉన్నాడని తెలిసింది. పాత స్నేహితులందరినీ పలకరించాలనే తలంపుతో, స్టాఫ్ రూం వైపు నడిచాను. ఆఫీసుకు అది కొంచెం ఎడంగా ఉంటుంది.

"మోహన్ వచ్చాడట గదా!" సీనియర్ తెలుగు పండితుడు రఘురాం మాటలు వినిపించి, గది బయటే ఆగాను, నా గురించి ఏమనుకుంటారో విందామని.

"వాడొస్తే బొగ్గే!" ఠక్కున అనేశాడు మాథ్స్ అసిస్టెంట్ కె.ఎస్.రావు.

నిశ్చేష్టుణ్నయ్యాన్నేను. ఇక్కడున్నప్పుడు నేను చేసే ప్రతి పనికీ 'సై' కొట్టేవాడు.

"అదేంది వయా గట్లంటవ్? మీ జిగ్రీ దోస్తే గద?" డ్రాయింగ్ మాస్టర్ పరశురాం పాయింట్ అవుట్ చేశాడు.

"ఒయ్! ఎవ్వని దోస్త్? వాడు మందు దాగేటోళ్లదోస్తు!" కే.ఎస్సార్.

అందరూ పగలబడి నవ్వారు.

నేను మందు తాగేది నిజమే. కాని, తాగుబోతుని కాదు. దాన్ని ఆసరాగా చేసుకొని రావు అట్లా మాట్లాడటం చివుక్కుమనిపించింది.

"మొత్తం మీద ఘనుడేనయ్యో! ఇక్కడున్నన్ని రోజులూ ఈ స్కూల్‌ను నాశనం జేసిండు. ఇగ, అక్కడెన్ని కతల్ జేస్తున్నడో?" ఫిజిక్స్ ప్రేమ్‌కుమార్ మరో వ్యంగాస్త్రం వేశాడు.

"ఇంకేం జేస్తడు? నడిచేటోళ్ల కాళ్లల్ల కట్టెలు వెడతడు" మరింత రెచ్చిపోయాడు రావు.

మళ్లీ నవ్వులు.

"అయినా ఏమాట కామాటే జెప్పుకోవాలె. మోహన్ శానా తెలివైనోడేనయ్యా!"

పరశురాం కితాబు నా ఆవేదన కొంత తగ్గించింది.

"ఏం జేసుకోవడానికి వాని తెలివి? మురికి గుంటలో నీళ్లు- తాగడానికే గాదు- కడుక్కోవడానికే ఇష్టమనిపించదు..." రఘురాం అసహ్యం.

నా కాళ్ల కింద నేల కదిలిపోతున్న ఫీలింగ్.

అతనంతటితో ఆగలేదు - "ఏ నాడైనా హృదయపూర్వకంగా పాఠం చెప్పాడా? పన్నెండేళ్లిక్కడ పనిచేశాడు. ఒక్క సంవత్సరమైనా సిలబస్ పూర్తిచేసిన పాపాన పోలేదు. వాని

తెలివి కూలగొట్టడానికి, కాలబెట్టడానికే గాని నిర్మాణానికీ, సంక్షేమానికీ పనికొచ్చేది గాదు. తెలిసీ తెలియనివన్నీ తనకే తెలుసునని మాట్లాడటం, ప్రతివాని వ్యవహారంలో తల దూర్చడం. వాడెన్ని పనికిమాలిన పనులు చేశాడు? ఇన్ని చూశాను.''

రఘురాం 'ఇన్ని' అనేమాట తలవెంట్రుకలను చూయించి అంటాడు.

"అయ్యో ! వాడిక్కడే ఉన్నాడు వయా!"

ఉలిక్కిపడ్డాన్నేను.

పరశురాం కొనసాగించాడు - "హెచ్చెం గదిలో ఉన్నాడు ఏ క్షణంలోనైనా ఇక్కడికి రావచ్చు. ఎట్లాగూ పొయ్యాడు గదా. 'పోయి నోళ్లందరూ మంచోళ్లే' అనుకుందాం'' సానుభూతి కోటింగ్.

"వీడు పోయినా మంచోడు కాలేడు. చచ్చీ సాధించే రకం!" రావు ఆక్రోశం.

మరో మారు నవ్వులు.

నేనక్కడుండలేకపోయాను. ఎంతో సంతోషంగా అందర్నీ కలవాలనుకున్నాను. వీళ్లెంత గాలివాటంగాళ్లో తెలిసింతర్వాత - మనసు ముక్కలైపోతున్నది. ఒకప్పుడు హెచ్చెమ్‌కి వ్యతిరేకంగా నేను చేసిన ప్రతి పనికీ వీళ్లు తాళం వేసినవాళ్లే. ఇలాంటివాళ్లను చూసే శ్రీశ్రీ అని ఉంటాడు, 'నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే నిర్దాక్షిణ్యంగా వీరే'నని. ఇంతకంటే మేడం నయం! రాగానే ఆప్యాయంగా పలకరించింది. ఇంక ఒక్క క్షణం కూడా ఉండకూడదనిపించింది కాని ముబారక్ అలీ గుర్తుకొచ్చాడు.

ఇంతలో మైక్‌లో కార్తీక్ గొంతు వినబడింది.

"ప్రియమైన విద్యార్థులారా! మన ముబారక్ అలీ మాస్టారొచ్చేశారు. అందరూ వచ్చి వేదిక ముందు తరగతివారీ వరుసల్లో నిలబడండి.''

ఒక్క నిముషంలో విద్యార్థులంతా చకచకా తమ స్థానాల్లో నిలుచున్నారు. ఆశ్చర్య పోయాన్నేను.

నేను పనిచేసే కాలంలో పి.ఈ.టీ అరచి, గగ్గోలు పెట్టి, విజల్‌తో చెవులకు తూట్లు కొడితే పదినిముషాలు పట్టేది, వీళ్లంతా నిలబడటానికి, ఈ కార్తీక్ వద్ద ఏ మంత్రం ఉందో? చేతిలో కనీసం 'దండం' కూడా లేదు.

విద్యార్థులను కూర్చోబెట్టింతర్వాత పెద్దలందరినీ ఆహ్వానించాడు. ఆ తర్వాత విద్యార్థులను మాట్లాడకుండా ఉండాల్సిందిగా సూచించాడు.

ఇంతలో ముబారక్ కనిపించాడు.

"హలో! ముబారక్ !" ఎదురేగి కరచాలనం చేశాను.

"థ్యాంక్యూ మోహన్! వస్తావో, రావో అనుకున్నా" చేయి పట్టుకొని ఊపేశాడు.

కొంతలో కొంత తృప్తి. 'గుడ్డిలో మెల్ల' లా. అతను ఆనందంగా పలకరించాడో లేదో కాని, ఆ పలకరింపు వెనుక ఏ కల్మషమూ కనబడనీయలేదు.

మిగతా టీచర్సంతా కలిశారు. నవ్వుతూ పలకరించారు. అంతకు ముందు వాళ్ల మాటలు విని ఉండడం వలన ఆ నవ్వుల మాటు నున్న వికృతరూపాలే నాకు కన్పిస్తున్నాయి. అవి ఆ సమాగమస్పర్శను హృదయానికి చేరనీయకుండా అడ్డుకుంటున్నాయి.

నా ప్రతిస్పందనను పట్టించుకోకుండానే "రండి, అలా కూర్చుందాం!" అంటూ లాక్కుపోయి వాళ్ల సరసన కూర్చోబెట్టుకున్నారు. తప్పలేదు.

నేను పక్కనే ఉన్నా, నాతో గాని, నా గురించి గానీ వాళ్లు మాట్లాడింది చాలా తక్కువ. నేను కూడా నా సహజ స్వభావానికి విరుద్ధంగా మౌనప్రేక్షకుణ్నయ్యాను.

"ఏంటి గురూ? క్షణం తీరిక లేకుండా వాగే వాడివి. మౌనవ్రతంలో ఉన్నావా?" కే.ఎస్. రావుది ఎత్తిపొడుపో, సానుభూతో అర్థం కాలేదు.

'మూర్ఖులతో మాట్లాడదలచుకోలేదు' అని గట్టిగా అరవాలనుకున్నా. కానీ నా భావాన్ని జీవంలేని ఓ చిరునవ్వుతో అణచిపెట్టేశాను. మెల్లగా కార్యక్రమం చూడటంలో లీనమయ్యాను.

కార్తీక్‌ను చూస్తుంటే, ఒక పక్క అసూయగా ఉంది. తలలో నాల్కలా అన్ని పనులూ చేస్తూ, చెరగని చిరునవ్వుతో, దాన్ని మించిన వినయంతో అంతటా తానే అయ్యి కనిపిస్తున్నాడు. నా స్థానంలో వచ్చినవాడు నా కంటె ఉన్నతుడుగా గుర్తింపు పొందటం మింగుడు పడటంలేదు. మరో పక్క నా ఉద్యోగజీవితంలోని తొలి రోజులు గుర్తుకు రాసాగాయి.

ఏ సబ్జెక్టిచ్చినా రెడీ; ఎంత సమయమైనా బడిలో గడిపేందుకు సిద్ధం. పిల్లలతో ఆట పాటల్లో పాల్గొంటూ, పనులన్నీ చక్కబెడుతూ, బోధన కోసం ఎప్పటికప్పుడు తయారవుతూ ఎంతో స్ఫూర్తిదాయకంగా వ్యవహరించేవాడు. కాని, తనకు లభించిన గుర్తింపు అహాన్ని,

అలసత్వాన్ని, అతి వాదాన్ని, భేదోపాయాన్ని, కపటాన్ని తనకు తెలియకుండానే తనలో పెంచసాగిందనే విషయం ఇప్పుడిప్పుడే గ్రహింపుకొస్తుంది.

'కరడుగట్టిన పాతభావాలు విడిచి, నిరంతర అధ్యయనశీలతను అలవరచుకోవాలన్న డా. సర్వేపల్లి వారి మాటలు విశ్వసించే తాను, ఆ భావాల నెప్పుడో తుంగలో తొక్కేశాడు. 'నాకు తెలిసిందే చెబుతాను. నేను చెప్పిందే వినా'లనే కొత్త సిద్ధాంతం ఊపిరి పోసుకొని, పాత విధానాలనే విద్యార్థులకు రుద్దడం. వాటి నమలు పరచేందుకు దండన మార్గాన్ని అవలంబించడం విద్యార్థుల్లో ప్రేమాభిమానాలకు బదులు భయాన్ని పెంపొందించడం. ఈ నేపథ్యంలో విద్యార్థులకు దూరం కావడం జరిగిందేమో!

నా మూర్ఖత్వంతో, వితండవాదంతో, కుబుద్ధితో తోటివాళ్లకూ ఎలా దూరమవుతున్నానో ఇప్పుడే గ్రహింపుకొచ్చింది.

నా ఆలోచనల్లో నేను కొట్టుకుంటూండగానే, సభలో వక్త ప్రసంగం లోని ఒక మాట నా గుండెను తాకింది. "ఎంత కాలం జీవించామనేది కాదు ముఖ్యం. ఏది సాధించామనేదే ముఖ్యం."

అదో మహనీయుని దివ్యవాక్కు. నా మనస్సుకు కమ్ముకున్న పొరలన్నీ క్రమక్రమంగా దూరమవుతున్న భావన బలపడసాగింది. ❖

(10 ఏప్రిల్ 2005- ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం)